సాక్షి మంచిర్యాల

ఆదివారం । 2 । మార్చి । 2025



లెక్కింపు పెద్ద కథే..!

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 3న కరీంనగర్‌లో జరగనుంది. సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆదివారం 6:18	సోమవారం 5:17

గరిష్టం/కనిష్టం 29.0 /19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: నేరాల నియంత్రణలో, నార్కొటిక్, ఎక్స్‌ప్లోజివ్ గుర్తింపులో పోలీస్ జాగిలాల పాత్ర కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం రామగుండం కమిషనరేట్‌కు 2024 బ్యాచ్ జాగిలాలు మూడింటిని కేటాయించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నార్కోటిక్ డాగ్(జెస్సీ) గంజాయి, మత్తు పదార్థాల గుర్తింపులో, స్నిపర్ డాగ్(రైడర్) ఎక్స్‌ప్లోజివ్ గుర్తింపులో, ట్రాకర్ డాగ్(టైసన్) వివిధ రకాల నేరాలకు పాల్పడిన నిందితులను గుర్తించడంలో ఏడాదిపాటు శిక్షణ పొందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) సి.రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్‌ఐలు వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, సీసీ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ రాజన్న జాతర ఆదాయం రూ.11.39 లక్షలు



హుండీ నగదు లెక్కిస్తున్న సభ్యులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధి బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో జాతర ఆదాయం రూ.11,39,369 సమకూరింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజులు జాతర నిర్వహించగా.. శనివారం హుండీ లెక్కించారు. దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ. 2,92,600, అభిషేకం ద్వారా రూ.40,200, కల్యాణ కట్నాలు ద్వారా రూ.16,240, బహిరంగ వేలం ద్వారా రూ.3,73,000, హుండీ ఆదాయం రూ.4,17,329 వచ్చినట్లు ఆలయ ఈవో బాపురెడ్డి తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆదాయం స్వల్పంగా తగ్గినట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా ‘పది’ పరీక్షలు



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో యాదయ్య సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్, రూట్ అధికారులతో పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సౌకర్యాలు పరిశీలించాలని, ఏవైనా సమస్యలున్నట్లయితే మండల విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఏడు పేపర్లు ఉంటాయని, జవాబు పత్రాలు 24, 12 పేజీల బుక్‌లెట్ల రూపంలో ఉంటాయని, పరీక్షలు మార్చి 21నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా సహాయ పరీక్షల అధికారి దామోదర్‌రావు, సెక్టోరల్ అధికారులు సత్యనారాయణమూర్తి, చౌదరి, డీసీఈబీ భీంరావు, ఎంఈవోలు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలని పోస్టుకార్డులు



పోస్టుకార్డులతో నాయకులు

మంచిర్యాలఅర్బన్: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని విద్యార్థులతో ఉత్తరాలు రాసి ముఖ్యమంత్రికి పంపించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు పై చదువుల కోసం స్కాలర్‌షిప్‌లు రాక.. కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వక, డబ్బులు కట్టలేక చదువులు మధ్యలో మానేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు సికిందర్, కార్తీక్, వంశీ, మానస, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



ప్లాంటు నిర్మాణం కోసం స్థలం చదును

మూడో అడుగు

- పదేళ్ల నిరీక్షణకు తెర
- ఎస్టీపీపీలో మరో ప్లాంటు నిర్మాణం
- రూ.6700 కోట్ల వ్యయం.. 800 మెగావాట్లు
- సింగరేణి సిగలో మరో వెలుగుల నగ
- బీహెచ్‌ఈఎల్‌కే ప్లాంటు నిర్మాణ పనులు

జైపూర్: జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ) విస్తరణకు మరో అడుగు పడింది. ఎట్టకేలకు మూడో యూనిట్(800 మెగావాట్లు) థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణానికి మోక్షం కలిగింది. పదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ మళ్లీ బీహెచ్‌ఈఎల్ కంపెనీ కొత్త ప్లాంటు బీటీజీ, బీవోపీ నిర్మాణ పనుల టెండర్లు దక్కించుకుంది. ఇక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాకనే ఆలస్యం అన్నట్లుగా ఎస్టీపీపీ అధికార యంత్రాంగం పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తోంది. 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటును విస్తరిస్తూ మూడో యూనిట్ నిర్మాణానికి సంస్థ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 2010లో రెండు యూనిట్ల(600+600మెగావాట్లు) థర్మల్ పవర్ ప్లాంటు పనులు ప్రారంభించగా.. 2017లో పూర్తయ్యాయి. రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి నిరంతర విద్యుత్ వెలుగులు పంచుతోంది. రెండో దశలో మూడో యూనిట్ నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం కేసీఆర్ 2015లోనే పనులకు శంకుస్థాపన చేశారు. డీపీఆర్ తయారు చేసి టెండర్ల దశకు వెళ్లడానికి ఏళ్లు గడువగా.. గత ఏడాది మొదటిసారి వేసిన టెండర్లను రద్దు చేసి ఈ ఏడాది మళ్లీ టెండర్లు పిలిచారు. మళ్లీ అదే బీహెచ్‌ఈఎల్ కంపెనీ బీటీజీ, బీవోపీ నిర్మాణ పనుల టెండర్లు దక్కించుకుంది. రూ.6700కోట్ల వ్యయంతో కొత్త ప్లాంటు 800మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును రెండు యూనిట్లకు ముందు భాగంలో నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ముగియడంతో ప్లాంటు నిర్మించే స్థలాన్ని అధికారులు చదును చేస్తున్నారు. ఇక ఏ క్షణంలోనైనా సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసే అవకాశం ఉండడంతో అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది.



శిలాఫలకం నిర్మాణం

సింగరేణికి సిరులు..

కొత్త ప్లాంటుతో సింగరేణి సంస్థకు సిరులు కురిపించనుంది. బొగ్గు అధారిత థర్మల్ పవర్ ప్లాంటు కావడంతో విద్యుత్ ఉత్పత్తికి ప్రధానంగా బొగ్గు, నీరు అవసరం. ఇప్పటికే సింగరేణి సంస్థ అవసరానికి మించి ఇక్కడ భూముల సేకరణ చేపట్టడం, షెట్‌పల్లి గోదావరి నది నుంచి 1టీఎంసీ నీరు, కోటపల్లి మండలం దేవులవాడ నుంచి 2టీఎంసీల నీరు పైపులైన్ల ద్వారా పవర్‌ప్లాంటుకు తరలిస్తున్నారు. ఇక సంస్థకు చెందిన భూగర్భగనులు, ఓసీపీ ఉండడం, శ్రీరాంపూర్ సీహెచ్‌పీ నుంచి ఎస్టీపీపీ బొగ్గు రవాణాకు శాశ్వతంగా రైల్వేట్రాక్‌లైన్ నిర్మించి బొగ్గు తరలిస్తున్నారు. రెండు యూనిట్ల నిర్వహణకు బొగ్గు, నీరు తరలించడానికి ఇప్పటికే నిర్మాణాలు చేపట్టి ఉండడం, కొత్త ప్లాంటు నిర్మిస్తుండడంతో మూడో యూనిట్ నిర్వహణ చేపట్టడం చాలా సులభతరం కావడంతోపాటు భారీగా ఖర్చు కూడా తగ్గనుంది. బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా విద్యుత్ ఉత్పత్తి రంగంలో దూసుకెళ్తూ దేశ స్థాయిలో సింగరేణి సంస్థ తన చరిత్ర తిరగరాస్తోంది. ఓ పక్కన థర్మల్ పవర్ ప్లాంటు మరో పక్కన సోలార్ ప్లాంట్ల నిర్మాణంతో సింగరేణి విద్యుత్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తోంది.

మరో 5వేల మందికి ఉపాధి..

కొత్త ప్లాంటు నిర్మాణంతో 5వేల మందికిపైగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కలుగనుంది. రెండు యూనిట్లలో ఇప్పటికే స్థానిక భూనిర్వాసితులు సుమారు వెయ్యిమంది ఆయా విభాగాల్లో పని చేస్తుండగా పలు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు 500మందికిపైగా పని చేస్తున్నారు. ఇప్పటికే స్థానికులకు 80శాతం ఉపాధి అవకాశాలు కల్పించడానికి సంస్థ ఉత్తర్వులు ఇవ్వడంతో కొత్త ప్లాంటులో స్థానిక నిరుద్యోగులకు బోలెడు ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయి.

పత్తి డబ్బులు పడ్తలే..!

- రైతుల ఎదురుచూపులు
- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ

మంచిర్యాలఅగ్రికల్చర్: దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ రంగ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు ధర, సకాలంలో నగదు పొందాలని అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తృత ప్రచారం చేశారు. దీంతో రైతులు అష్టకష్టాలు పడి ప్రభుత్వ రంగ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించగా.. నగదు కోసం నెలల తరబడి ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ రంగ కొనుగోలు సంస్థ సీసీఐకి గత డిసెంబర్, జనవరిలో పత్తి విక్రయించిన రైతులకు ఇప్పటికీ నగదు అందలేదు. పత్తి విక్రయించిన వారం రోజుల వ్యవధిలో రైతుల ఖాతాల్లో నగదు జమ కావాల్సి ఉండగా.. నెలలు గడుస్తోంది. దీంతో పంట పెట్టుబడికి తెచ్చిన అప్పుపై వడ్డీ పెరిగి, పత్తి ఏరిన కూలీలకు డబ్బు చెల్లించడానికి వాయిదాలు పెడుతున్నారు. ఇటు సీసీఐ అధికారులు అటు మార్కెట్ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గత నెలలో చెన్నూర్ మార్కెట్ పరిధిలో రైతులు రాస్తారోకో చేసిన సమయంలో పత్తి విక్రయించిన డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.



డిసెంబర్‌లో సీసీఐకి విక్రయించిన పత్తి తక్‌పట్టి

జిల్లాలో సేకరించిన పత్తి

సీసీఐ	6,32,965 క్వింటాళ్లు
మొత్తం రైతులు	25,029 మంది
చెల్లించాల్సిన నగదు	రూ.478,47,61,875
నగదు అందిన రైతులు	22,951 మంది
అందిన నగదు	రూ.449,66,55,665
ఇంకా అందాల్సిన రైతులు	2078 మంది
అందాల్సిన నగదు	రూ.274,62,01,184

మూడు నెలలైంది..



మూడు నెలల కిందట చెన్నూర్ మార్కెట్ పరిధి మిల్లులో సీసీఐకి 30 క్వింటాళ్ల పత్తి అమ్మిన. ఇటు మిల్లు, అటు మార్కెట్ సార్లను అడిగితే రేపు మాపు అంటున్నారు. రూ. 2,26,382 రావాలి. మూడు నెలల నుంచి కైకిలోల్లు డబ్బులు ఇవ్వమని ఇంటికి వచ్చి లొల్లి చేస్తున్నరు. ఆలస్యం చేయకుండా పైసలు వేయాలి.

– బింగి పద్మ, నెన్నెల

వడ్డీ పెరిగిపోతోంది..



అమ్ముకునేందుకు అరిగోస పడుడు అయింది. అమ్మిన పత్తికి మూడు నెలల నుంచి పైసలు పడలేదు. చెన్నూర్ మార్కెట్ పరిధిలోని జిన్నింగ్ మిల్లులో పత్తి అమ్మిన. పత్తి కాంటా పెట్టేటప్పుడు పట్టాపాసుబుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు బుక్ అన్ని కాగితాలు జిరాక్స్ ఇచ్చిన. మళ్లీ మార్కెట్ ఆఫీసు కాడా కూడా రెండు సార్లు ఇచ్చిన. సాగు కోసం బ్యాంకు లోను తీసుకున్న. వడ్డీ పెరిగిపోతంది. కైకిలోల్లకు పైసలు ఇయ్యలేదు. పత్తిని మిల్లుకు తీసుకపోయినందుకు బండి కిరాయి కట్టలేదు.

– పుట్ట గంగయ్య, నెన్నెల

పర్యావరణం, మానవాళికి పక్షుల మేలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ, కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ
- మంచిర్యాలలో కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్

మంచిర్యాలఅగ్రికల్చర్: పక్షులు జీవవైవిధ్యంతో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మానవాళికి మేలు చేస్తున్నాయని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అటవీశాఖ, వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్, నేచర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ పక్షుల ప్రాముఖ్యత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, బర్డ్ ఫెస్టివల్ వర్క్‌షాప్‌లు దోహదపడుతాయని తెలిపారు. పక్షుల సంరక్షణ అలవాటుగా మార్చుకోవాలని, పతంగుల మాంజా దారం వల్ల ఎన్నో పక్షులు చనిపోతున్నాయని, కొన్ని రకాల పక్షులు వేటగాళ్ల బారిన పడి అంతరించిపోతున్నాయని తెలిపారు. సలీం అలీ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సర్వే నిర్వహించి పక్షులపై పుస్తకం రూపొందించారని, మన రాష్ట్రంలో కవ్వాల్ ప్రాంతంపై పరిశోధించాలని అన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని అడవుల్లో అనేక రకాల పక్షిజాతులు జీవిస్తున్నాయని తెలిపారు. అనంతరం కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో సంచరించే వివిధ రకాల పక్షులతో కూడిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, సీసీఎఫ్ శరవణన్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల అటవీ శాఖ అధికారులు శివ్ ఆశిష్ సింగ్, నీరజ్‌కుమార్, డాక్టర్ శాంతారామ్, వెట్ లాండ్స్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ గుజ్జా భిక్షం, బర్డ్స్ మైగ్రేషన్ స్టడీస్ ప్రముఖులు డాక్టర్ సాతియా సెల్వ, ఎఫ్‌డీవో సర్వేశ్వర్‌రావు, అటవీ కళాశాల(ములుగు) విద్యార్థులు, జిల్లాలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్షుల ప్రాముఖ్యత తెలిసింది..



మంచిర్యాలక్రైం: బర్డ్ ఫెస్టివల్‌కు రావడం వల్ల పక్షుల ప్రాముఖ్యత తెలిసింది. ఈ రోజు గఢ్‌పూర్, కవ్వాల్ తదితర ప్రాంతాల్లో వివిధ రకాల జాతుల పక్షులను వీక్షించాం. అనంతరం వర్క్‌షాపులో పక్షుల గొప్పతనం, పక్షుల అరుపులు, వాటి జీవన విధానంపై నిపుణులు తెలియజేశారు.

– సాయిదీప్, ఫారెస్ట్ కాలేజ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ములుగు

పక్షులను సంరక్షించాలి



మంచిర్యాలక్రైం: పక్షులను సంరక్షించేందుకు అందరూ ఆసక్తి చూపాలి. ఒకప్పుడు రాబందులు బహిరంగ ప్రదేశాల్లో పడేసిన కళేబరాలను ఆహారంగా తీసుకొని పర్యావరణం కలుషితం కాకుండా కాపాడేవి. అవి నేడు పూర్తిగా అంతరించిపోయాయి. పక్షులు మానవాళికి కీడు కలిగించే క్రిమికీటకాలు, పంటలకు నష్టం కలిగించే కీటకాలను తినేసి పంటలను కాపాడే విధంగా ఉండేవి.

– నిరంజన్, ఫారెస్ట్ కాలేజ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ములుగు

వెంకట్రావుపేటలో పక్షుల కిలకిలలు







గ్రామ చెరువులో పక్షుల సందడి, వలస వచ్చిన పక్షులు

- ఫారెస్టు అధికారుల బర్డ్‌వాక్
- గ్రామంలో పర్యాటకుల సందడి

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామ శివారులో ఉన్న చెరువు పక్షుల కిలకిలలతో కనువిందు చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రకరకాల పక్షులు వలస వస్తుండడంతో సందడి నెలకొంటోంది. అటవీశాఖ అధికారులు వలస పక్షులపై అధ్యయనం చేస్తున్నారు. బైనాక్యులర్‌తో వీక్షిస్తూ.. కెమెరాల్లో బంధిస్తూ పక్షిశాస్త్రం శాస్త్రవేత్తలకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామంలోని చెరువు చేపలకు మాత్రమే ఉపయోగంగా ఉండేది. కొన్ని రోజులుగా ఉదయం, సాయంత్రం వేళల్లో వస్తున్న పక్షులను వీక్షించడానికి తిప్పేశ్వర్, నిర్మల్, ఒడిశా, మహారాష్ట్ర నుంచి అటవీ అధికారులు ఇక్కడికి వస్తున్నారు. శనివారం కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్ బాబడే, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, ఉట్నూర్ ఎఫ్‌డీవో రేవంత్, రీసెర్చ్ అసోసియేట్ సోహం, ఉమ్మడి జిల్లాలోని ఎఫ్‌డీవో, డీఎఫ్‌వోలు వచ్చి పరిశీలించారు. సైబీరియా, యూరప్, నార్త్ దేశాల నుంచి పక్షులు రెడ్‌క్రిస్‌డెట్ పోచాడ్, నార్తన్ ప్రింటెల్, గాడ్వాల్, కాటన్ పిగ్మిబూష్, లెసర్ విజిటింగ్ డ్రక్ తదితర 97రకాల పక్షులు వలస వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పక్షులు పెద్దమొత్తంలో వచ్చి మార్చి నెల చివరలో వాటి గమ్యానికి వెళ్లి పోతుంటాయి. అటవీ అధికారులు శనివారం నుంచి బర్డ్ వాక్ నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. విదేశాల నుంచి వలస పక్షులు రావడం సంతోషంగా ఉందని, పర్యాటక ప్రాంతంగా ప్రకటించాలని గ్రామస్తుడు మధుకర్ కోరుతున్నాడు.



పక్షులను చూస్తున్న ఫారెస్టు అధికారులు

పరిశుభ్రత పాటించాలి

గ్రామ చెరువుకు విదేశీ పక్షులు, ఇతర పక్షులు ఎక్కువగా వస్తున్నాయి. ప్రశాంతమైన వాతావరణం అనుకూలించడంతో పక్షుల రాక పెరిగిపోయింది. చెరువు ప్రదేశంలో పరిశుభ్రతను పాటించాలి. గ్రామ పంచాయతీ అధికారులు చెరువు ప్రదేశంలో చెత్త, దుర్వాసన, కలుషితమైన నీరు చెరువులోకి రాకుండా చూడాలి. పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– లక్సెట్టిపేట ఎఫ్‌ఆర్వో సుభాష్

నిరుద్యోగుల ఉపాధి కల్పనకు కృషి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాల కల్పనకు అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద 18 రకాల ట్రేడ్‌లలో శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ పథకం కింద అందిన దరఖాస్తులను ఎల్–1 స్థాయిలో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. భవన నిర్మాణ రంగం, పెయింటింగ్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, ప్లంబింగ్, మోటార్ సైకిల్ మరమ్మతు వంటి వాటిపై శిక్షణ అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్యలతో కలిసి ముఖ్య పర్యవేక్షకులు, అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో నీటిపారుదల శాఖ ఏఈలు, డివిజన్, మండల పంచాయతీ అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, ఆస్తి పన్ను వసూలు, పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల పరిరక్షణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను బకాయిలను 100 శాతం వసూలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవిలో తాగునీటి సమస్యల లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గాంధారివనంలో ఉత్సాహంగా బర్డ్ ఫెస్టివల్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారివనం, గాంధారి ఖిల్లాలో శనివారం బర్డ్ ఫెస్టివల్ నిర్వహించారు. అటవీ శాఖ, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్, నేచర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఫెస్టివల్‌లో మంచిర్యాలకు చెందిన కస్తూర్బా పాఠశాల, ములుగులోని అటవీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ బృందాలుగా విడిపోయి అనేక రకాల పక్షులను ఆసక్తిగా తిలకించారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్, ఎన్‌సీఎఫ్ ప్రతినిధులు హర్షత్రివేని, అమృత, సమాక్షి వివిధ రకాల పక్షులను చూపిస్తూ వాటి వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారులు అప్పలకొండ, శివకుమార్, ప్లాంటేషన్ మేనేజర్ జి.సురేష్, ఇంచార్జి రేంజ్ ఆఫీసర్ సుభాష్, డిప్యూటీ రేంజ్ అధికారులు హఫీజుద్దీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



పక్షుల గురించి వివరిస్తున్న అధికారి

క్లుప్తంగా

చెట్టును ఢీకొట్టిన లారీ

కడెం: మండలంలోని దోస్తనగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉట్నూర్ నుంచి పశువుల ఎరువు లోడుతో లారీ కడెం వైపు వస్తుండగా మార్గమధ్యలో దోస్తనగర్ అటవీ ప్రాంతంలో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మండలంలోని మైసంపేట్‌కు చెందిన లారీ డ్రైవర్ దోసండ్ల ఎల్లయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అంబులెన్స్‌తో చేరుకున్న 108 ఈఎంటీ మురళి, పైలట్ వసంత్‌రావు గాయపడ్డ డ్రైవర్‌కు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రాంరెడ్డి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంరెడ్డి శుక్రవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో నివాసముంటున్న తన బామ్మర్ది నివాసానికి వచ్చాడు. ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపాడు. శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనం కోసం చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలో..

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని తిలక్‌నగర్‌కు చెందిన కొంగ సాయినాథ్‌కు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయినాథ్ గత నెల 27వ తేదీ మధ్యాహ్నం తన స్నేహితుడిని ట్రైన్ ఎక్కించేందుకు వచ్చి తన దిక్వచక్రవాహనాన్ని రైల్వే స్టేషన్ సమీపంలోని ఫారెస్ట్ కార్యాలయం పక్కన నిలిపి ఉంచాడు. రైల్వేస్టేషన్ లోపలికి వెళ్లి తిరిగి రాగా బైక్ కనిపించలేదు. బైక్ చోరీకి గురైనట్లు గుర్తించి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై ఎస్సై భాస్కరాచారి కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ (జి) మండలం చాక్‌పల్లి గ్రామానికి చెందిన తండ్రి, కొడుకు గోరేమియా హుస్సేన్, ఫిర్దోస్ గోరేమియా కల్లూరులో శనివారం నిర్వహించే మేకల సంతకు వెళ్లారు. సంత జరుగుతున్న క్రమంలో 61 జాతీయ రహదారిపై వాహనం నిలిపి వారు గొర్రెలను రోడ్డుపై ఉంచి దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పెట్రోకార్ సిబ్బంది అక్కడికి వెళ్లి ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎస్సై భాస్కరాచారి, సిబ్బంది విజయ్ వీడియో తీస్తుండగా గోరేమియా హుస్సేన్, ఫిర్దోస్ గోరేమియా సెల్‌ఫోన్‌ను లాక్కుని విధులకు ఆటంకం కలిగించి దూషించారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ప్రకృతిలో ఎన్నో వింతాలు, ఎన్నెన్నో వర్ణాలు, మరెన్నో అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఓ రైతుకు చెందిన పొలంలో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న మొక్కజొన్న, పక్కన కోతకు వచ్చిన జొన్న, మొక్కజొన్న ఇలా విభిన్న వర్ణాలతో కనిపించాయి. సిరికొండ మండల కేంద్రం నుంచి ఇచ్చోడ వెళ్లే దారిలో కనిపిస్తున్న ఈ చిత్రం చూపరులకు కనువిందు చేస్తోంది. – సిరికొండ

లెక్కింపు పెద్ద కథే..!

- ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు విభిన్నం
- ఫలితం వెలువడాలంటే ఆలస్యం
- రేపు కరీంనగర్‌లో ఓట్ల లెక్కింపు

సాక్షి, మంచిర్యాలడెస్క్: మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం పోలింగ్ ముగిసింది. ఇక లెక్కింపు ప్రక్రియ ఈ నెల 3న కరీంనగర్‌లో జరగనుంది. పట్టభద్రుల స్థానంలో 56మంది, ఉపాధ్యాయుల స్థానానికి 15మంది పోటీ పడ్డారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 3,55,159మంది ఓటర్లు ఉండగా.. 2,50,328 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 70.48శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయుల స్థానంలో 27,088 మంది ఓటర్లు ఉండగా.. 24,968మంది ఓటు వేశారు. 92.17శాతం ఓటింగ్ నమోదైంది. సాధారణ ఎన్నికల్లో ఈవీఎంలు వినియోగిస్తుండడంతో లెక్కింపు త్వరగా పూర్తయి ఫలితం గంటల్లోనే తేలిపోతుంది. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లు వినియోగిస్తుండడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియ భిన్నంగా ఉండడంతో ఫలితం తేలాలంటే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల స్థానంలో తక్కువ ఓట్లే ఉండడంతో ఫలితం ముందుగానే వెలువడుతుంది. పట్టభద్రుల స్థానంలో ఆలస్యం అవుతుంది.

నగానికి పైగా ఓట్లు వస్తేనే విజేత

సాధారణ ఎన్నికల్లో ప్రత్యర్థి కంటే ఎక్కువ ఓట్లు



సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గంలో పోలైన ఓట్ల(చెల్లుబాటు అయిన)లో మొదటి ప్రాధాన్యత ఓట్లు సగానికి పైగా సాధించిన వారినే విజేతలుగా ధ్రువీకరిస్తారు. లెక్కింపు ప్రక్రియ రౌండ్ల వారీగా, ఎలిమినేషన్ పద్ధతిలో సాగుతుంది. ముందుగా పోలైన ఓట్లలో చెల్లని ఓట్లను తొలగిస్తారు.

- మొదటి ప్రాధాన్యతను గుర్తించకపోయినా, ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులకు వేసినా, సరైన ప్రాధాన్యత లేకపోయినా ఆ ఓట్లను చెల్లని వాటిగా పరిగణిస్తారు.
- చెల్లుబాటైన ఓట్లలో మొదటి ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. 25 బ్యాలెట్లకు ఒక కట్టగా కడుతారు.
- పట్టభద్రుల్లో 2,50,328 ఓట్లు పోల్ కాగా.. ఉదాహరణకు వీటిలో 2,500 ఓట్లు చెల్లకుండా పోయాయి అనుకుంటే... ఆ ఓట్లను తీసేస్తే మిగిలిన 2,47,828 ఓట్లలో సగానికి పైగా మొదటి ప్రాధాన్యత ఓట్లు (1,23,914) కంటే ఒక ఓటు ఎక్కువ) సాధించిన అభ్యర్థిని గెలుపొందినట్లు ప్రకటిస్తారు.
- ఏ అభ్యర్థి కూడా సగానికి పైగా మొదటి ప్రాధాన్యత ఓట్లను సాధించని పక్షంలో ఎలిమినేషన్ రౌండ్ చేపడతారు.
- పోటీ చేసిన అభ్యర్థుల్లో అతి తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థిని ముందుగా ఎలిమినేషన్ చేస్తారు. ఒకవేళ ఇద్దరు అభ్యర్థులు సమాన ఓట్లు సాధించి చివరి స్థానంలో ఉంటే ఎన్నికల అధికారి డ్రా తీస్తారు. డ్రాలో వచ్చిన అభ్యర్థి బ్యాలెట్ పేపర్‌లోని మొదటి ప్రాధాన్యత ఓట్లను అలాగే ఉంచి రెండో ప్రాధాన్యత ఓట్లు ఏ అభ్యర్థికి వచ్చాయో వారికి కలుపుతారు.
- ఒక అభ్యర్థి ఎలిమినేషన్ తర్వాత కూడా ఫలితం తేలకపోతే మరో అభ్యర్థికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లనూ లెక్కిస్తూ వెళ్తారు. ఇలా రౌండ్ల వారీగా ఒక్కో అభ్యర్థిని ఎలిమినేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు.
- నిర్దేశించిన ఓట్లను సాధించలేకపోతే మూడో రౌండ్ ఎలిమినేషన్ చేపడతారు. మూడో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తూ కలుపుతారు. ఫలితం తేలే వరకు ఎలిమినేషన్ చేపడుతూ వెళ్తారు. ఈ క్రమంలో సగానికి పైగా నిర్దేశిత ఓట్లను ఎవరు సాధిస్తే వారు గెలిచినట్లు ప్రకటిస్తారు.

మామిడిలో టెంక పురుగు

- నివారించకుంటే తీవ్ర నష్టం



చెన్నూర్‌రూరల్: మామిడి అన్నింటిలో కంటే ప్రధాన పంట. సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే దిగుబడినిస్తుంది. మామిడిని అనేక కీటకాలు ఆశించి దెబ్బ తీస్తుంటాయి. పిందె దశలో టెంక పురుగు ఆశించి పంటకు నష్టం చేస్తుంది. దీని నివారణకు స్థానిక హెచ్‌వో కళ్యాణి పలు సూచనలు చేశారు.

టెంక పురుగు జీవన విధానం

టెంక పురుగులను ముట్టి పురుగులు, పెంకు పురుగులు అని అంటారు. వీటి తల్లి పురుగులు, పెద్ద పురుగులు గోధుమ రంగులో దృఢంగా ఉంటాయి. తల్లి పురుగు మామిడి కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నపుడు కాయ చర్మంపై రంధ్రం చేస్తుంది. అందులోకి చేరి గుడ్లు పెట్టి అవి జారి పడకుండా జాగ్రత్త పడుతుంది. ఈ గుడ్ల నుంచి విడుదలైన పిల్ల పురుగులు లేత పసుపు రంగులో ఉండి ముదురు రంగు లేదా నల్లని తలతో ఉంటాయి. ఇవి కాయలోకి చొచ్చుకుపోయి కండ ద్వారా ప్రయాణించి టెంకలోకి చేరుతాయి. ఆ తరువాత బీజాలు, కణజాలం తింటూ వృద్ధి చెందుతాయి. ఈ దశలో వృద్ధి చెందే కొద్ది కాయ రంధ్రం మూసుకుపోయి పురుగులున్నట్లు ఎవరికీ కనిపించదు. బీజాల చుట్టూ టెంక వృద్ధి చెందుతుంది. టెంకలోకి చేరిన పురుగులు అక్కడే తింటూ కోశస్థ దశనంతా అందులోనే పూర్తి చేసుకుంటాయి. పిల్ల పురుగు దశ నుంచి తల్లి పురుగుగా వృద్ధి చెందడానికి 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ఈ పురుగులు టెంక లోపలి గుజ్జును తినడంతో కాయలు వృద్ధి చెందవు. పక్వానికి రాకుండా ముందుగానే పండుబారుతుంది. తరువాత రాలిపోతుంది. కాయపై రంధ్రాలు చేసుకుని వెలుపలికి వచ్చి నేలపై పడి చెట్టు కాండం బెరడు సందుల్లో నెలల తరబడి జీవిస్తాయి. తద్వారా కాయలపై పెద్ద రంధ్రం ఏర్పడుతుంది.

నివారణ ఇలా..

టెంక పురుగు ఆశించిన టెంకలు విత్తనానికి పనికి రావు. రాలిన పండ్లు ఎప్పటికప్పుడు ఏరి కాల్చివేయాలి. ఇలా చేస్తే అందులోని లద్దె పురుగు ఇతర దశలు నాశనమవుతాయి. ఈ విధంగా మూడేళ్లు పురుగును వెతికి నాశనం చేయాలి. తోటల చుట్టుపక్కల మామిడి టెంకలు వేయకుండా జాగ్రత్త పడాలి. టెంకలను ఎండబెట్టి తరువాత పారేయాలి. ఇలా చేస్తే లోపలి పురుగులు చనిపోయి తర్వాత సంవత్సరం వీటి ఉధృతి తగ్గుతుంది. కాయలు కోసిన తర్వాత చెట్టు చుట్టూ లోతుగా మట్టి తవ్వి బయట పోస్తే కోశస్థ దశలో ఉన్న పురుగులు చనిపోతాయి. పిందె నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఒక మిల్లీ లీటరు డెల్టామెత్రిన్ లేదా 2.5 మిల్లీ లీటరు క్లోరోఫైరిపాస్ లేదా రెండు మిల్లీ లీటర్ల లెబాసిన్‌ను లీటరు నీటికి కలిపి మూడు వారాల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే టెంక పురుగును నివారించుకోవచ్చు.

86శాతం బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటివరకు 86 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 1, 2024 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 57.45 లక్షల టన్నులకు గాను 49.5 లక్షల టన్నులు సాధించి 86 శాతం ఉత్పత్తి నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరిలోనే నిర్దేశించిన లక్ష్యంలో 111 శాతం సాధించినట్లు తెలిపారు. భూగర్భగనుల్లో 89 శాతం, ఓపెన్ కాస్ట్ గనుల్లో 85 శాతం ఉత్పత్తి నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఇప్పటివరకు రూ.185 కోట్ల లాభాల్లో కొనసాగుతోందని తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో రూ.524 కోట్ల లాభాలు వచ్చాయని, ఈ లాభాలతో భూగర్భ గనుల్లో వచ్చిన నష్టాలు పూడ్చుకోగా మొత్తం మిగిలిందన్నారు. ఎస్ఎల్‌బీసీ వద్ద సేవలు అందించడానికి శ్రీరాంపూర్ నుంచి 40 మంది ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, సంక్షేమ అధికారిని పంపించామని పేర్కొన్నారు. గత నెల 77 మందికి క్వార్టర్లు కేటాయించామని చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి కంపెనీ వ్యాప్తంగా ఈ ఫైలింగ్ సిస్టం అమలులోకి రానుందని తెలిపారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో 161 మందికి ఎస్ఎల్పీ ప్రమోషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నూతన సంవత్సరానికి శ్రీరాంపూర్ ఏరియాకు 65.36 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మే నాటికి ఆర్కే 6గనిని మూసి వేయనున్నట్లు పేర్కొన్నారు. కొంత కాలానికి ఎస్సార్పీ–1 గని కూడా మూతపడుతుందని తెలిపారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం ఎం.సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, ఏజీఎం మురళీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

ఇంద్రవెల్లిలో అద్దె ఇంట్లో చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా



లింగన్న ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

- రూ.73,200 నగదు, వెండి అపహరణ

ఇంద్రవెల్లి: అద్దె ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మండల కేంద్రంలోని భీంనగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడగామ్ పంచాయతీ పరిధి జెండగూడ గ్రామానికి చెందిన తోడసం భగవంత్‌రావ్–గీత దంపతులు స్థానిక భీంనగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. గీత మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో సీఎస్‌పీగా, భగవంత్‌రావ్ మండలంలోని ముత్నూర్ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వీరు ఇంటికి తాళం వేసి సొంత గ్రామమైన జెండగూడకు వెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూడగా ఇంటి పైకప్పు రేకులు తొలగించి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. అందులో దాచిన బ్యాంక్ మిత్ర (సీఎస్‌పీ) లావాదేవీలకు సంబంధించిన రూ.70 వేలు, ఇంకో చోట దాచిన రూ.3,200 నగదు, కొంత వెండి చోరీకి గురైంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఎస్సై సునీల్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే డాగ్‌స్క్వాడ్ టీంను రప్పించి దర్యాప్తు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు ఎస్సై తెలిపారు.

భైంసా పట్టణంలో..

భైంసాటౌన్: పట్టణంలోని గీతానగర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. సీఐ గోపీనాథ్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గీతానగర్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ నాగమణి లింగన్న శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లగా, శనివారం ఉదయం ఇంటి పక్కనున్న వ్యక్తి ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించి ఆయనకు సమాచారమిచ్చాడు. దీంతో ఆయన వెంటనే ఇంటికి చేరుకుని పరిశీలించగా 10 తులాల బంగారం, రూ.40వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారమివ్వగా వారు క్లూస్‌టీంతో చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇదే కాలనీలోని మరో ఇంట్లోనూ చోరీకి పాల్పడగా, గదిలో ఏమీ లేవని తెలిపారు. బాధితుడు లింగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గంగన్నపేటలో..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగన్నపేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగన్నపేట గ్రామంలో నివసిస్తున్న ఆత్రం వినయక్‌రావు రెండ్రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఊరికివెళ్లాడు. గమనించిన దొంగలు తాళం పగులగొట్టి రూ.34వేల నగదు, తులన్నర బంగారం దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రంజాన్ మాసం షురూ

- ఆదివారం తొలి ఉపవాసం
- నెలపాటు ఉపవాస దీక్షలు
- దర్శనమిచ్చిన నెలవంక

నెన్నెల: ముస్లింలు అత్యంత పవిత్రంగా కఠోర నియమాలతో ఆహారపానీయాలను ముట్టుకోకుండా నెలపాటు చేపట్టే రంజాన్ ఉపవాసాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో ఈ నెల 2న తెల్లవారుజాము నుంచి మొదటి (రోజా) ఉపవాస దీక్షకు సిద్ధమయ్యారు. శనివారం రాత్రి నుంచే మసీదుల్లో ఖురాన్ పఠనం, తరావి నమాజ్‌లు ప్రారంభమయ్యాయి. పవిత్రమాసంలో నమాజ్‌ల కోసం మసీదులను ముస్తాబు చేశారు. వేకువ జామున ఉపవాస దీక్ష (సహర్) ప్రారంభించి సాయంత్రం దీక్ష విడిచే సమయం (ఇఫ్తార్) కోసం పట్టణాల్లో ప్రత్యేక వంటకాలను అందించడం కోసం హోటళ్లు కూడా సిద్ధమయ్యాయి. ఇలా 30రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి మళ్లీ సాయంత్రం ఆకాశంలో నెలవంకను చూసి మరుసటి రోజు ఉదయాన్నే రంజాన్ పండుగను జరుపుకొంటారు.

అతి పవిత్ర మాసం..

ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్. దివ్య ఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి ఈ మాసంలోనే వచ్చిందని వారు విశ్వసిస్తారు. ఈ నెలలో ఉపవాస దీక్ష ద్వారా శరీరాన్ని సుక్షింపజేయడం ద్వారా ఆత్మప్రక్షాళన అవుతుందని వారు నమ్ముతారు. ఉదయాన్నే అన్నపానీయాలను సేవించడాన్ని సహర్ అంటారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించి భోజనాన్ని తీసుకోవడాన్ని ఇఫ్తార్ అంటారు.



ప్రార్థనల కోసం సిద్ధమైన బెల్లంపల్లి బాబుక్యాంపు మసీదు

30 రోజులను మూడు భాగాలుగా..

రంజాన్ మాసంలో 30 రోజులను మూడు భాగాలుగా విభజిస్తారు. మొదటి పదిరోజులు రహమత్‌కే రోజాలు (కరుణ కురిపించే దినాలు), రెండో పదిరోజులు మగ్ ఫిరత్‌కే రోజాలు (పాపాల నుంచి క్షమాపణలు పొందే దినాలు), చివరి పదిరోజులు జహన్నుమ్‌సే ఛుట్కారే రోజాలు (నరకదండన నుంచి విముక్తి కోరే దినాలు) గా పాటిస్తారు.

ప్రత్యేక నమాజ్‌లు

ప్రతిరోజూ రాత్రి 8.30నుంచి 10 గంటల వరకు ఈ మాసంలో ప్రత్యేకంగా తరావీ నమాజ్‌లు చేస్తారు. దివ్యఖురాన్‌ను రోజుకు 20 రకాతుల చొప్పున తరావీ నమాజ్‌లో 27 రోజులపాటు హాఫిజ్‌లు పాటిస్తారు. రంజాన్‌లో రాత్రిపూట ఇషా నమాజ్ అనంతరం తరావీ నమాజ్ జరుగుతుంది. ఇలా 25 రోజుల తరావీ నమాజ్ జరిపిన తర్వాత 26వ రోజు సబ్ ఏ ఖదర్ రాత్రి నుంచి ఈద్ ఉల్‌ఫితర్ వరకు ఉపవాస దీక్ష ఆచరిస్తారు.

బాలుడి కిడ్నాప్ కలకలం!

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో బాలుడు కిడ్నాప్‌నకు గురయ్యాడనే వదంతులు వ్యాపించాయి. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన బక్కరు వంశీ (32) మూడ్రోజుల కిందట మండలంలోని తిర్పెల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. కొద్దిరోజులుగా మతి స్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. శనివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్దకు వచ్చి దగ్గరలో గల ఓ బాలుడిని (7) తీసుకుని సమీప చెరువు వద్దకు చేరుకున్నాడు. అక్కడ మొక్కజొన్న చేను దగ్గర కంకులు కాల్చుతూ కనిపించాడు. అటుగా వెళ్లిన మండల కేంద్రానికి చెందిన పలువురు గమనించి బాలుడిని తీసుకున్నారు. వంశీకి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి వంశీని అదుపులోకి తీసుకుని విచారించారు. వివరాలు తెలుసుకుని అతడి చెల్లి చిట్టిమల్ల రుచితకు అప్పగించారు.

హత్యాయత్నం కేసులో నలుగురి రిమాండ్

బెల్లంపల్లిరూరల్: యువకుడిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27న తేదీ రాత్రి కన్నెపల్లి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన దుర్గం మహేందర్‌పై బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామంలో అదే గ్రామానికి చెందిన దుర్గం సాయి, కోట బానేశ్, దుర్గం సన్నీ, కుంటాల ఆదిత్య దాడి చేశారు. మహేందర్ రోడ్డు పక్కన గుడిసె వేసే క్రమంలో పాత కక్షలతో బొలెరో వాహనాన్ని అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. దుర్గం సన్నీ కత్తితో మహేందర్ చాతి భాగంలో పొడిచాడు. గాయాలతో మహేందర్ అరవగా నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు తాళ్లగురిజాల పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం సదరు నిందితులు బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి శివారులోని ఓ మామిడి తోటలో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అక్కడ వారిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దుర్గం సాయి, కోట బానేశ్, దుర్గం సన్నీ, కుంటాల ఆదిత్యను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్, సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అఫ్జలొద్దీన్

అవమానభారంతో యువకుడి ఆత్మహత్య

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర గ్రామానికి చెందిన జోగురు మధు (20) అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధు కొంత కాలంగా పేకాట, కోడి పందేలకు అలవాటు పడ్డాడు. శుక్రవారం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా పొన్నారం గ్రామంలో కోడి పందేలు ఆడేందుకు వెళ్లాడు. అక్కడ నాగాపూర్ గ్రామానికి చెందిన గోపి మధును రూ.200 అడగగా ఇవ్వలేదు. దీంతో గోపి కోపంతో మధును బెల్ట్‌తో కొట్టాడు. ఇది అవమానంగా భావించిన మధు సాయంత్రం ఇంటికి వచ్చాడు. మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి మృతి చెంది ఉన్నాడు. పోస్టుమార్టం కోసం అతడి మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక సొంగిడిలో మరో యువకుడు..

బేల: మండలంలోని సాంగిడి గ్రామానికి చెందిన మాన్కర్ సంతోష్ (30) కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్నాళ్లుగా సంతోష్ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈ క్రమంలో సంతోష్ శుక్రవారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగువారు అతడిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష్ మృతిచెందాడు. మృతుడి సోదరుడు తుకారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లింగన్న తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

దండేపల్లి: మండలంలోని మేదరిపేటకు చెందిన గోలి రమేశ్ బైండోవర్ ఉల్లంఘించినందుకు గాను తహసీల్దార్ సంధ్యారాణి రూ.లక్ష జరిమానా విధించారు. వాటిని అతను శనివారం చెల్లించినట్లు లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కిరాణావ్యాపారి రమేశ్ గతంలో గుడుంబా తయారీదారులకు బెల్లం, పటిక విక్రయిస్తూ పట్టుబడ్డాడు. దీంతో అతడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. రమేశ్ మళ్లీ పటిక, బెల్లం అమ్ముతూ ఇటీవల పట్టుబడటంతో కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట హాజరుపర్చారు. కాగా, బైండోవర్ ఉల్లంఘించినందుకు గాను అతడికి జరిమానా విధించారు.

ప్రాణాలు కాపాడిన హెల్మెట్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో గల ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఓ వ్యక్తి బైక్‌ను ఆపి ఉండగా.. వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్‌కు చెందిన వసంతరావు నిర్మల్ రూరల్ మండలం డ్యాంగాపూర్‌లోగల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. నిర్మల్‌లోనే నివాసముంటున్న అతడు పని నిమిత్తం శనివారం సాయంత్రం బయటకు వెళ్లాడు. శివాజీచౌక్‌లో సిగ్నల్ పడడంతో.. బైక్ ఆపాడు. అదే సమయంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో వసంతరావు బైక్ పైనుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స కోసం అతడిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వసంతరావు హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు.